## 64. గీత దాటక

మీరు వాహనం డ్రైవ్ చేసుకుంటూ వెళ్తూన్నప్పుడు, రోడ్డు మధ్యగల తన సరిహద్దు గీతని దాటి అవతలివైపు నించి వచ్చే వాహనం మీ దారిలో వస్తే ఏమవుతుందో తెలుసా?

అందరు డ్రైవర్లూ ఇలా రారు. ఆల్కహాల్ మత్తు, అలసట, నిద్ర రావడం, తుమ్మడం లాంటి వాటివల్ల, ఎదుటి నించి వచ్చే వాహనం అకస్మాత్తుగా మన వాహనానికి అడ్డు వచ్చి ప్రమాదం కలిగించవచ్చు.

'నువ్వు గీతకి అటుంటే, నేను గీతకి ఇటుంటా' అన్న నియమాన్ని పాటిస్తే ఎవరికీ ఏంకాదు. మనం నిత్య జీవితంలో కూడా ఈ ఆదర్శాన్ని అన్నిట్లోనూ పాటిస్తే గొడవే వుండదు.

ఇతరుల గురించిన వదంతులు, చెడు మాటలు మాట్లాడటం ఈ గీత దాటడం లాంటివే. ఎప్పటికైనా వాటి ఫలితం మనం పొందక మానం.

దీన్నే కర్మ సిద్ధాంతం అని, 'ఇతరులకి నువ్వేం చేస్తే దాన్ని నువ్వు తిరిగి పొందుతావు.' అని మన సనాతన ధర్మం చెప్తోంది.

## 65. పునర్జన్మ

ఓ ఆధ్యాత్మిక గురువు తమ ఊరు వచ్చాడని తెలిసి ఒకతను ఆయన దర్శనానికి వెళ్ళాడు.

"అయ్యా! నాదో సందేహం. పునర్జన్మలు ఉన్నాయా? లేవా?" ప్రశ్నించాడతను.

"ఉన్నాయి." గురువు జవాబు చెప్పాడు.

"ఉంటే మరి నా గత జన్మ నాకు గుర్తులేదే?" ప్రశ్నించాడు అతను.

"నువ్వు పుట్టాక మొదటిసారి కళ్ళు తెరిచి ఏదో ఒకటి చూసావు కదా. అదేమిటో చెప్పు." ఠక్కున అడిగాడు గురువు.

"గుర్తు లేదు." జవాబు చెప్పాడతను.

"కిందటి మంగళవారం ఈ టైంలో నువ్వేంచేస్తున్నావో చెప్పు."

అతను సమాధానం చెప్పలేక పోయాడు.

"పోనీ నిన్న ఉదయం అన్నంలో నువ్వు కలుపుకున్న రెండో ఐటం ఏమిటి?" మళ్ళీ ప్రశ్నించాడు గురువు.

అదీ అతనికి గుర్తులేదు.

"పునర్జన్మ ఎంత సహజమో మరుపు కూడా అంతే సహజం కాబట్టి నీకు నీ పునర్జన్మలేం గుర్తు లేవు." గురువు వివరించాడు.

## 66. ఆధారం-పరిణామం

శాస్త్రవేత్తలు సాధారణంగా నాస్తికులై ఉంటారు కదా. ఓ శాస్త్రవేత్తకి దేవుడంటే నమ్మకం లేదు. ఓ సారి అతను ఓ దైవభక్తుడి ఇంటికి వెళ్ళాడు. అతనింట్లో ప్లాస్టిక్‌తో చేసిన ఓ గ్లోబ్‌ని చూసి ఆసక్తిగా అడిగాడు శాస్త్రవేత్త.

"బావుంది. ఏ దేశంలో తయారైందిది? చైనాలోనా?"

"లేదు. దానంతటదే తయారైందిది." జవాబు చెప్పాడా భక్తుడు.

"అదెలా సాధ్యం? ఏ వస్తువైనా ఎవరూ లేకుండా దానంతట అదే ఎలా తయారవుతుంది? ఆధారం లేకుండా పరిణామం అసాధ్యం అని భౌతిక శాస్త్ర సూత్రం." చెప్పాడా శాస్త్రవేత్త.

"సృష్టికర్త లేకుండా ఈ సృష్టి సాధ్యం అయిందని కదా మీ నాస్తికుల వాదన? అదే సూత్రంతో ఈ భూగోళం కూడా తయారైంది." నవ్వుతూ చెప్పాడా భక్తుడు.

## 67. ప్రపంచాన్ని బాగుచేయడం ఎలా?

శివాజీ సైన్యంలోని ఓ జనరల్ ఓసారి సమర్థ రామదాసుకి నమస్కరించి వినయంగా అడిగాడు.